15-04-2025
మంగళవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 204 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి

## అంబేద్కర్ విదేశీ విద్యానిధి మళ్లీ ప్రారంభిస్తాం



- ఎస్సీ పిల్లలకు అత్యున్నతమైన విద్య అందించడమే లక్ష్యం
- మరిన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటుకు సిద్ధం
- గత ప్రభుత్వం అమరావతిని నాశనం చేస్తే... మేము నిర్మిస్తున్నాం..
- దళితుల కోసం యుద్ధం చేసిన యోధుడు అంబేద్కర్
- అంబేద్కర్ స్ఫూర్తితో దళితుల అభ్యున్నతికి టీడీపీ కట్టుబడి ఉంది
- తాడికొండ నియోజకవర్గం పొన్నెకల్లులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ప్రభుత్వ సాయంతో నాడు విదేశాల్లో చదివి, నేడు ఉద్యోగం చేస్తున్న వారితో వర్చువల్‌గా మాట్లాడిన సీఎం

**జయభేరి, అమరావతి :**
దళితుల కోసం యుద్ధం చేసిన యోధుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని, ఆ మహనీయుని స్ఫూర్తితో దళితుల అభ్యున్నతి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఎస్సీ విద్యార్థులు విదేశాల్లో చదవాలన్న కలను మళ్లీ నిజం చేస్తామని, అంబేద్కర్ విదేశీ విద్యా దీవెనను తిరిగి ప్రారంభిస్తున్నామని చెప్పారు. భవిష్యత్‌లో ఎస్సీ పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు మరిన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. గత పాలకులు కక్షపూరితంగా అమరావతిని నాశనం చేశారని, ప్రజల ఆశీస్సులతో ప్రపంచంలోనే మేటి నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతామని సీఎం చంద్రబాబు అన్నారు. తాడికొండ నియోజకవర్గం పొన్నెకల్లులో అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి అక్కడ ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో మాట్లాడారు.

**భారత ప్రజాస్వామ్యానికి దశ దిశ చూపిన అంబేద్కర్ :** 1891, ఏప్రిల్ 14న మహారాష్ట్రలోని మోవ్ గ్రామంలో అంబేద్కర్ జన్మించారు. ఆ రోజుల్లో బడుగులంటే సమాజంలో చిన్నచూపు ఉండేది. అంటరానితనం, వివక్ష, అసమానత, అవమానాలపై అంబేద్కర్ అలుపెరుగని పోరాటం చేశారు. దళితుల కోసం యుద్ధం చేశారు. 1927లో దళితులకు నీటి హక్కు కల్పించా

...మిగతాది 2 లో




...మిగతాది 2 లో

# మనిషికి ఆధార్ భూమికి భూదార్

రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ఎంతో అధ్యయనంతో తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని క్షేత్ర స్థాయికి సమర్థంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు నిర్దేశించారు. ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతి మండలంలో సదస్సు నిర్వహించాలని, ప్రతి కలెక్టర్ మండల స్థాయి సదస్సులకు హాజరై అక్కడ రైతులు, ప్రజలు లేవనెత్తే సందేహాలకు వారికి అర్థమయ్యే భాషలో వివరించి పరిష్కారం చూపాలని చెప్పారు.

## రాణా దొరికాడు.. మరి హెడ్లీ ఎక్కడ



**జయభేరి, ముంబై, ఏప్రిల్ 14:**
2008 ముంబై ఉగ్రవాద దాడులలో కీలక కుట్రదారుడు తహవ్వుర్ రాణాను అమెరికా ప్రభుత్వం భారతదేశానికి అప్పగించిన నేపథ్యంలో.. మరొక ప్రధాన కుట్రదారుడు డేవిడ్ హెడ్లీని ఎప్పుడు తీసుకువస్తారనే చర్చ ఇప్పుడు దేశవ్యాప్తంగా జరుగుతోంది. అయితే అతడిని భారతదేశానికి తీసుకురావడం దాదాపు అసాధ్యంగా కనిపిస్తోంది.ముంబై దాడులకు ముందు.. ఆ కుట్రలో కీలక పాత్ర పోషించిన డేవిడ్ కోల్మన్ హెడ్లీ ముంబైలో రెక్కీ నిర్వహించాడు. అతడికి అన్ని విధాలా రాణా సహాయం చేశాడు. ఇప్పుడు రాణాను అమెరికా ప్రభుత్వం భారతదేశానికి అప్పగించేంది. కానీ హెడ్లీని అప్పగించడానికి అమెరికా సిద్ధంగా లేదని తెలుస్తోంది. దీనికి చట్టపరమైన, దౌత్య, వ్యూహాత్మక కారణాలు ఉన్నాయని గూఢచారి వర్గాలు వెల్లడించాయి. 2010లోనే హెడ్లీ తనను భారత్, పాకిస్తాన్, డెన్మార్క్ దేశాలకు అప్పగించకూడదని అమెరికా అధికారులతో ఒప్పందం చేసుకున్నట్లు తెలియజేశారు. ఇది చట్టబద్ధమైన ఒప్పందమని.. రాణా వంటి కుట్రదారులకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇచ్చినందుకు బదులుగా అతనికి మరణశిక్ష నుంచి తప్పించుకున్నాడని ఆ వర్గాలు వివరించాయి. ముంబై దాడులలో తన పాత్ర, లష్కర్‌ఎతోయిబా, పాకిస్తాన్ ISIతో సంబంధాల గురించి అతను అంగీకరించిన నేపథ్యంలో.. అమెరికా గూఢచారి సంస్థలకు అతను కీలకంగా మారాడు హెడ్లీని భారతదేశానికి అప్పగించడం వల్ల తమ దేశ గూఢచార కార్యకలాపాలు, ప్రస్తుత విచారణలకు అడ్డంకులు ఏర్పడతాయని అమెరికా భావిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎఫ్‌బిఐ వంటి అమెరికన్ గూఢచారి సంస్థలతో అతనికి సంబంధాలు ఉన్నాయి. అతను గతంలో వాటికి రహస్య

...మిగతాది 2 లో




## రెవెన్యూ క్లారిటీ.. ఆ భూమంతా సర్కారుదే

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 14:**
కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని తేల్చి చెప్పారు రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలతో పాటు..హెచ్‌సీయూకి కేటాయించిన భూములన్నీ రాష్ట్ర ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టు నియమించిన కమిటీకి నివేదిక ఇచ్చారు. ఇప్పటివరకూ ప్రభుత్వ రికార్డులలో హెచ్‌సీయూ పేరుతో పట్టాలేదని.. అవన్నీ ప్రభుత్వ భూములుగా రికార్డుల్లో ఉన్నాయంటూ నివేదికలో పేర్కొన్నారు. 50 ఏళ్ల కిందట అప్పటి ప్రభుత్వం వర్సిటీ ఏర్పాటుకు అడ్వాన్స్ పొజిషన్ పద్ధతిలో 2 వేల 375 ఎకరాలు ఇచ్చిందని తెలిపారు.కంచ గచ్చిబౌలి భూముల అంశంపై ప్రభుత్వం, పలు సంఘాలు, రాజకీయ నేతలతో వేర్వేరుగా భేటీ అయిన కమిటీ సభ్యులు చివరగా రెవెన్యూ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రెవెన్యూ రికార్డుల పరంగా అన్ని వివరాలు సమర్పించాలని అడగడంతో... రెవెన్యూ అధికారులు నివేదిక సిద్ధం చేసి కమిటీకి అందజేశారు. HCUకు కేటాయించిన భూముల్లో ప్రభుత్వ, ప్రజా అవసరాల కోసం అప్పుడప్పుడూ అవసరమైన మేరకు తీసుకున్నామని రెవెన్యూ అధికారులు నివేదికలో తెలిపారు. ఇలా తీసుకున్న ప్రతిసారీ వర్సిటీ పరిపాలనా విభాగం అధికారులకు సమాచారం ఇచ్చామని చెప్పారు.క్రీడల అభివృద్ధి,

...మిగతాది 2 లో

## తిరుమలేశుని సేవలో అన్నా కొణిదల

**కుమారుడు మార్క్ శంకర్ పేరిట నిత్యాన్నదానానికి రూ. 17 లక్షల విరాళం**




**జయభేరి, తిరుమల:**
కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా కొణిదల దర్శించుకున్నారు. సోమవారం వేకువజామున వైకుంఠ క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోని ప్రవేశించి శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొన్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో అన్నా కొణిదలరికి వేద పండితులు వేదాశీర్వచనం అందించి, శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామివారి ఆలయం ఎదురుగా ఉన్న అఖిలాండం

...మిగతాది 2 లో

## ముర్షిదాబాద్‌లో ఏం జరుగుతోంది

2 పేజీ

▶▶ మొదటిపేజీ తరువాయి

## భూమికి భూదార్

హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో (MCRHRD) కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో భూ భారతి, ఇందిరమ్మ ఇండ్లు, వేసవి తాగు నీటి ప్రణాళికలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఉప ముఖ్యమంత్రి, మంత్రివర్గ సహచరులు, ప్రభుత్వ సలహాదారులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భూ భారతి, ఇందిరమ్మ ఇండ్లను తాము ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని, ఈ రెండింటిని క్షేత్ర స్థాయికి తీసుకెళ్లడంలో కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ముఖ్యమంత్రి చెప్పారు. భూ భారతి చట్టాన్ని కలెక్టర్లు సమగ్రంగా అధ్యయనం చేయాలని, గతంలో రెవెన్యూ సమస్యల పరిష్కారాన్ని పట్టించుకోకుండా రైతులను న్యాయస్థానాలకు పంపారని, భూభారతి చట్టంలో రెవెన్యూ యంత్రాగమే ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని, అప్పీల్ వ్యవస్థ ఉన్న విషయాన్ని రైతులు, ప్రజలకు వెల్లడించాలని తెలిపారు. భూ భారతి పైలెట్ ప్రాజెక్టు సదస్సులను నారాయణపేట జిల్లా మద్దూర్, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, ములుగు జిల్లా వెంకటాపూర్ మండలాల్లో నిర్వహిస్తారని, ఆయా మండల కేంద్రాల్లో సదస్సులకు కలెక్టర్లు కచ్చితంగా హాజరుకావాలని, ఆయా మండలాల్లో ప్రతి గ్రామంలో రెవెన్యూ సిబ్బందితో సదస్సులు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయా సదస్సులకు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర మంత్రులు హాజరువుతారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నందున గ్రామ స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు ఆమోదం పొందిన జాబితాను మండల స్థాయి కమిటీలు పరిశీలించాలని సీఎం సూచించారు. ఆ కమిటీల పరిశీలన అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి పంపాలని.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదించాకే ఇండ్ల జాబితా ఖరారవుతుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ వ్యవహారం సక్రమ పర్యవేక్షణకు ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిని నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. ఈ ప్రత్యేకాధికారి ఇందిరమ్మ కమిటీలు, మండల కమిటీలు, కలెక్టర్లు, ఇన్‌ఛార్జి మంత్రి మధ్య సమన్వయకర్తగా ఉంటారని చెప్పారు. వేసవి కాలంలో ఎక్కడా తాగు నీటి సమస్య తలెత్తకుండా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ముఖ్యమంత్రి సూచించారు. తాగునీటి సరఫరా విషయంలో నీటి పారుదల శాఖ, తాగు నీటి సరఫరా శాఖ, విద్యుత్ శాఖ సమన్వయంతో పని చేయాలని చెప్పారు. ప్రతి గ్రామంలో తాగునీటి వనరులు, సరఫరాపై పర్యవేక్షించాలని చెప్పారు.

## తిరుమలేశుని సేవలో అన్నా కొణిదల

వద్ద హారతులు ఇచ్చారు. స్వామి వారికి కొబ్బరికాయ కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

**స్వయంగా భక్తులకు అన్నప్రసాదం వడ్డించిన అన్నా కొణిదల**

స్వామి వారి దర్శనానంతరం ఉదయం 10 గంటల సమయంలో అన్నా కొణిదల మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్నదాన సత్రాన్ని సందర్శించారు. కుమారుడు కొణిదల మార్క్ శంకర్ పేరిట రూ. 17 లక్షలు విరాళాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులకు అందించారు. అనంతరం నిత్యాన్నదాన సత్రంలో శ్రీవారి భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. అనంతరం భక్తులతో కలసి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

## రెవెన్యూ క్లారిటీ..

ఇతర అవసరాలకు 2002, 2003 సంవత్సరాల్లో 534 ఎకరాలు HCU నుంచి తీసుకున్నామని రెవెన్యూ అధికారులు నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం. ఇందులో IMG అకాడమీస్ భారత్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలు, ప్రస్తుత TNGOకు 134 ఎకరాలు అప్పటి ప్రభుత్వం కేటాయించింది. ఐఎంజీ సంస్థ ఒప్పందం ప్రకారం క్రీడల అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో 2006లో 400 ఎకరాలను వెనక్కి తీసుకుంటూ అప్పటి ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసిందని నివేదికలో పేర్కొన్నారు. 534 ఎకరాలకు బదులుగా గోపన్‌పల్లిలో 397 ఎకరాలు HCUకు తిరిగిచ్చామంటూ.. వాటికి సంబంధించిన ధ్రువపత్రాలను నివేదికతో పాటు పొందుపరిచారు. తమకు కేటాయించిన 400 ఎకరాల భూములను తిరిగివ్వాలంటూ ఐఎంజీ భారత్ సంస్థ 2006లో వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. స్టే విధించిందని, అప్పటి నుంచి ఆ భూములను ఎవరూ పట్టించుకోకపోవడంతో చెట్లు, పొదలు పెరిగాయని అధికారులు నివేదికలో వెల్లడించారు. ఆ భూములు ప్రభుత్వానివేనని 2024 మార్చిలో హైకోర్టు, 2024 జూన్‌లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చాయని తెలిపారు. ఇదిలా ఉంటే.. కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూముల వివాదం పరిష్కార మార్గాలపై ప్రభుత్వం స్పెషల్ ఫోకస్ చేసింది. ఇందులో భాగంగా చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెకర్ విష్ణువర్ధన్ రెడ్డి, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ డోబ్రియల్, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు శనివారం రాత్రి ఢిల్లీకి వెళ్లారు. సుప్రీంకోర్టుకు చీఫ్ సెక్రటరీ సమర్పించాల్సిన కౌంటర్ అఫిడవిట్, ఈ నెల 16న జరగనున్న విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫున వినిపించాల్సిన వాదనలపై సీనియర్ న్యాయవాదులతో రెండు మూడు రోజుల పాటు సంప్రదింపులు జరుపనున్నారు. తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు పనులన్నింటినీ నిలిపివేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో ప్రస్తుతం ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. ఈ భూముల్లో ప్రభుత్వం చేపట్టిన పనులపై చీఫ్ సెక్రటరీ సహా వివిధ విభాగాల అధికారులతో రివ్యూ నిర్వహించారు. చెట్ల నరికివేతకు అవసరమైన అనుమతులు పొందిన విషయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. 16న విచారణ జరిగే సమయానికి మధ్యంతర రిపోర్టును సుప్రీంకోర్టుకు సమర్పించనునుంది. మరోవైపు చీఫ్ సెక్రటరీపై సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ కౌంటర్ అఫిడవిట్‌లో పూర్తి వివరాలు వెల్లడించాలని ఆదేశించింది. దీంతో పొందుపర్చాల్సిన అంశాలపై రెవెన్యూ, అటవీ, పరిశ్రమల శాఖ అధికారులతో పలుమార్లు సమావేశమైన చీఫ్ సెక్రటరీ .. ఆ భూమితో సెంట్రల్ వర్సిటీకి సంబంధం లేకపోవడం, పూర్తిగా రెవెన్యూశాఖకు చెందినదేనని ధృవీకరించే రికార్డులు, ఉమ్మడి రాష్ట్రంలో ఆ భూమిని ప్రైవేటు సంస్థకు అప్పజెప్తూ తీసుకున్న నిర్ణయం.. వీటన్నింటినీ ఆ అఫిడవిట్‌లో పొందుపర్చాలని సీఎస్ భావిస్తున్నారు. జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ, చెట్ల నరికివేత, వన్యప్రాణుల సంచారం, భూ యాజమాన్య హక్కులు తదితర లీగల్ అంశాలపై సీనియర్ న్యాయవాదులతో సంప్రదింపుల తర్వాత అఫిడవిట్‌కు తుది రూపు ఇచ్చే అవకాశముంది. ప్రభుత్వ ఉద్దేశాలన్నింటినీ న్యాయవాదులకు వివరించి ఈ నెల 16న దీటుగా వాదనలను వినిపించాలన్నదే సీఎస్ టీమ్ ఢిల్లీ టూర్ ప్రధాన లక్ష్యం.

## రాణా దొరికాడు..

సమాచారం చేరవేస్తూ సీక్రెట్ ఇన్‌ఫార్మర్ గా పనిచేశాడని ఆ వర్గాలు వెల్లడించాయి. అలాగే ముంబై దాడి సమాచారం ముందుగానే అమెరికా గూఢచారి సంస్థల దృష్టికి వచ్చిందని, కానీ దానిని నివారించడానికి అమెరికా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోలేదని కొన్ని లీక్ అయిన డాక్యుమెంట్ల ద్వారా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో హెడ్లీని అప్పగించడం వల్ల అమెరికా సమాచార సేకరణ పద్ధతులు, ఉగ్రవాది ఇన్‌ఫార్మర్‌గా హెడ్లీ వ్యవహారం బహిర్గతం కావచ్చని పేర్కొన్నారు. ముందస్తు ఒప్పందం ప్రకారం అతనికి మరణశిక్ష విధించకూడదు. కానీ అజ్మల్ కసబ్ వంటి ఉగ్రవాదుల విషయంలో కఠిన వైఖరి అనుసరించిన భారత్ ఈ షరతును అంగీకరించలేదని గూఢచారి వర్గాలు తెలిపాయి. ఇవన్నీ హెడ్లీ అప్పగింతకు అడ్డంకులుగా మారాయి. ట్రావెల్ ఏజెన్సీ నడుపుతున్న సమయంలో అతనికి హెడ్లీ పరిచయమయ్యాడు. ముంబై ఉగ్రదాడికి ముందు పాకిస్తానీఅమెరికన్ ఉగ్రవాది డేవిడ్ హెడ్లీతో రాణా సంబంధం కలిగి ఉండేవాడని భారత విచారణ ఏజెన్సీ అయిన ఎన్ఐఏ తెలిపింది. 26/11 దాడికి ముందు 8 సార్లు హెడ్లీ భారతదేశానికి వచ్చాడని.. ఆ సమయంలో 231 సార్లు రాణాతో సంప్రదింపులు జరిపాడని తెలిపింది. దాడులకు ముందు 2006, సెప్టెంబర్ 14న హెడ్లీ మొదటిసారి భారతదేశానికి వచ్చి రిక్కీ నిర్వహించాడని.. అప్పుడు 32 సార్లు రాణాతో మాట్లాడినట్లు పేర్కొంది. హెడ్లీ భారతదేశానికి వచ్చినప్పుడల్లా.. ఒకసారి 23 సార్లు, మరోసారి 40 సార్లు, మరొకసారి 66 సార్లు.. ఇలా అనేకసార్లు మాట్లాడినట్లు తెలిపింది. దాడులకు సంబంధించిన ప్రాంతాల ఎంపికలో హెడ్లీకి రాణా ఎలా సహాయం చేశాడో ఎన్ఐఏ డాక్యుమెంట్లు స్పష్టంగా వివరించాయి. 26/11 ముంబై దాడుల ప్రధాన కుట్రదారుడు తహవుర్ రాణాను భారత జైలులో వీఐపీ ట్రీట్మెంట్ ఇస్తూ.. బిర్యానీలు పెట్టి పోషించకూడదని, అతడిని ఉరితీయాలని దేశ ప్రజలు సోషల్ మీడియా వేదికల ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. వారిలో 2008లో ముంబై ఉగ్రవాద దాడుల నుండి అనేక మంది ప్రాణాలను కాపాడిన స్థానిక టీ విక్రేత 'చోటు చాయ్ వాలా' అలియాస్ మహ్మద్ తౌఫిక్ కూడా ఉన్నారు. ఈ విషయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అజ్మల్ కసబ్‌కు ఇచ్చినట్లుగా తహవ్వుర్ రాణాకు ప్రత్యేక సెల్ లేదా, బిర్యానీ, ఇతర సౌకర్యాలు అందించాల్సిన అవసరం లేదన్నారు.

# ముర్షిదాబాద్‌లో ఏం జరుగుతోంది

**వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. సెంట్రల్ బెంగాల్ జిల్లా అయిన ముర్షిదాబాద్‌లో పరిస్థితులు అదుపు తప్పాయి. ఈ హింసాత్మక ఘటనలో ముగ్గురు మరణించారు. మరణించిన వారిని ఎజాజ్ అహ్మద్ (17), హర్‌గోవింద్ దాస్ (65), చందన్ దాస్(35)గా గుర్తించినట్లు రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు చెప్పాయి.**



హర్‌గోవింద్, చందన్‌లు తండ్రికొడుకులని.. వీరు మేకల వ్యాపారం చేస్తూ చాలీచాలని సంపాదనతో జీవిస్తున్నారని పొరుగింటి వారు చెప్పారు. ఈ హింసాత్మక ఘర్షణల్లో పలువురికి గాయాలయ్యాయి. ఇప్పటి వరకు 150 మందిని పైగా అరెస్ట్ చేసినట్లు సీనియర్ పోలీసు అధికారి చెప్పినట్లు వార్తా సంస్థ పీటీఐ రిపోర్టు చేసింది. ప్రజలు శాంతియుతంగా ఉండాలంటూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోరారు. ''రాజకీయ ప్రయోజనాల కోసం అల్లర్లను ప్రేరేపించవద్దు'' అని తన ఎక్స్ హ్యాండిల్‌లో అభ్యర్థించారు. ఈ హింసాత్మక ఘర్షణల తర్వాత, రాజకీయ ప్రయోజనాల కోసం కొన్ని పార్టీలు మతాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఆరోపించింది. సుమారు 26 వేల మంది స్కూల్ టీచర్లు తమ ఉద్యోగాలను పోగొట్టుకున్న విషయం నుంచి ప్రజల దృష్టి మళ్లించి, ఓటు బ్యాంకును పొందేందుకు టీఎంసీనే ఈ హింసను ప్రేరేపిస్తుందని ప్రతిపక్ష భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రత్యారోపణ చేసింది. బెంగాల్‌లో వక్ఫ్ చట్టాన్ని అమలు చేయబోమని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. రాష్ట్రానికి తక్షణమే కేంద్ర భద్రత బలగాలను పంపించాలని కోల్‌కతా హైకోర్టు ఆదేశించింది. జిల్లాకు కేంద్ర భద్రతా బలగాలను పంపించాలని కోరుతూ పశ్చిమ బెంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారి వేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ఈ ఆదేశాలను జారీ చేసింది. బెంగాల్ ఉన్నతాధికారులతో కేంద్ర హోం శాఖ కార్యదర్శి మాట్లాడినట్లు వార్తా సంస్థ ఏఎన్ఐ రిపోర్టు చేసింది. అవసరమైన సాయమంతా అందిస్తామని హోం శాఖ కార్యదర్శి తెలిపినట్లు పేర్కొంది.

ముర్షిదాబాద్‌లోనే 300 మంది బీఎస్ఎఫ్ సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు హోం శాఖ కార్యదర్శి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు అదనంగా బలగాలను అక్కడకు పంపించినట్లు తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ముర్షిదాబాద్ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. ఉత్తర బెంగాల్‌ను దక్షిణ బెంగాల్‌తో అనుసంధానించే జాతీయ రహదారి 12పై ఉన్న సజూర్ మోర్ ప్రాంతంలో, ధులియాన్ మున్సిపాలిటీకి చెందిన జఫ్రాబాద్ పట్టణంలో నెలకొన్న హింసాత్మక ఘర్షణల్లో ముగ్గురు చనిపోయారు.

ఈ రెండు ప్రాంతాలు బంగ్లాదేశ్ సరిహద్దులో ముర్షిదాబాద్ జంగీపూర్ సబ్‌డివిజన్‌లో ఉన్నాయి. ''17 ఏళ్ల ఎజాజ్ అహ్మద్‌కు సజూర్ మోర్‌లో బుల్లెట్ తగిలింది. వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. అహ్మద్ చనిపోయారు.'' అని బెంగాలీ వార్తా పత్రికకు ముర్షిదాబాద్‌కు చెందిన ఒక సీనియర్ జర్నలిస్ట్ చెప్పారు. ''శనివారం ఉదయం జఫ్రాబాద్‌లో తండ్రి, కొడుకు మృతదేహాలను గుర్తించారు. వారి శరీరాలపై గాయాల గుర్తులు ఉన్నాయి. ఈ గుర్తులు బట్టి వారు హత్యకు గురైనట్లు తెలుస్తోంది'' అని తెలిపారు. అహ్మద్‌ను ఎవరు చంపారో ఇప్పటి వరకు పోలీసులు ధ్రువీకరించలేదు. దాస్ కుటుంబ సభ్యుల మరణంపైనా రకరకాల కథనాలు వస్తున్నాయి. స్వీట్ల తయారీదారు హేమంత్ దాస్ దిఘ్రీలో ఉంటుంటారు. ఇది జఫ్రాబాద్‌కు పక్కనే ఉంటుంది. తాను హర్‌గోవింద్ దాస్ ఇంటికి వెళ్లినట్లు హేమంత్ దాస్ చెప్పారు. తండ్రీకొడుకులను ఎందుకు హత్య చేశారో తెలియడం లేదని హేమంత్ దాస్ ఫోన్‌లో ఒక జర్నలిస్టుతో చెప్పారు. '' వారిది (దాస్ కుటుంబం) మేకల వ్యాపారం చేసే చిన్న కుటుంబం. ఎందుకు వారిని లక్ష్యంగా చేసుకున్నారో నాకు తెలియడం లేదు'' అని హేమంత్ దాస్ అన్నారు. తొలుత రాళ్లు రువ్వారు. ఆ తర్వాత వారి ఇంటిపై కొందరు వ్యక్తులతో ఉన్న గుంపు దాడి చేసింది. వారిని దోచుకునేందుకు ప్రయత్నించింది. దాస్ కుటుంబం ప్రతిఘటించినప్పుడు, ఆ గుంపు వారిని కొట్టి చంపేసింది'' అని హేమంత్ దాస్ చెప్పారు. రెండు వర్గాల మధ్య ఘర్షణల్లో తండ్రి, కొడుకు చనిపోయారని మరో స్థానిక జర్నలిస్టు చెబుతున్నారు. ప్రార్థనల తర్వాత నిరసనలు పెద్దఎత్తున జరిగినప్పటికీ ప్రశాంతంగా సాగాయి. జాతీయ రహదారి వైపు దాక్ బంగ్లా మోర్ వైపుగా యాంటీవక్ఫ్ ర్యాలీలు కొనసాగాయి. హిందువులు ఎక్కువగా ఉండే ఘోస్ పారాను దాటుతున్నప్పుడు ర్యాలీల్లో ఒకదానిలో చిన్నపాటి గొడవ జరిగింది. మొదట రాళ్లను అవతలి వర్గమే రువ్విందటూ రెండు వర్గాలూ పరస్పరం ఆరోపించుకున్నాయి. జాతీయ రహదారిపై ఉన్న నిరసనకారులకు ఈ విషయం తెలియగానే, అల్లర్లు జరిగాయి. దుకాణాలను ధ్వంసం చేశారు.'' అని ఆయన చెప్పారు. ఘర్షణలలో చాలా వాహనాలు మంటల్లో కాలిపోయాయి. ఆస్తుల ధ్వంసమయ్యాయి. రతన్‌పూర్‌లోని ఆలయం, శివమందిర్ ప్రాంతంలోని మసీదును లక్ష్యంగా చేసుకుని ఈ అల్లర్లు జరిగాయి. జఫ్రాబాద్‌లో ఘర్షణలు నెలకొనడం దురదృష్టకరం. ఎందుకంటే, హిందువులు, ముస్లింలు ఇక్కడ ఎప్పుడూ శాంతియుతంగా జీవిస్తుంటారు. ఈ ఘర్షణల నుంచి ఆలయాన్ని రక్షించేందుకు రతన్‌పూర్‌లో శాంతి సమావేశాన్ని రెండు వర్గాలు ప్రతినిధులు నిర్వహించారు'' అని ఒక టీచర్ తెలిపారు. 2011 జనగణన ప్రకారం, ముర్షిదాబాద్‌లో 66 శాతానికి పైగా ముస్లిం జనాభా. తాజాగా జరిగిన అన్ని ఎన్నికల్లో దాదాపు ప్రతి సీటును తృణమూల్ కాంగ్రెస్ చేజిక్కించుకుంది. ముర్షిదాబాద్‌లో ఉన్న ముగ్గురు ఎంపీలు కూడా అధికార పార్టీకి చెందినవారే. రాష్ట్ర అసెంబ్లీలో ముర్షిదాబాద్ నుంచి 22 సభ్యులు ఉండగా అందులో 20 మంది టీఎంసీకి చెందినవారే. ఉత్తర ముర్షిదాబాద్ ప్రాంతంలో ఈ హింసాత్మక ఘర్షణలు జరిగాయి. ఈ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేలందరూ తృణమూల్ కాంగ్రెస్‌వారే. అంతేకాక, మొత్తం 8 మున్సిపాలిటీల్లో ఏడు ఈ పార్టీ నియంత్రణలో ఉన్నాయి. బీజేపీ ఉనికినే లేకుండా ఇంత ఎక్కువ మెజార్టీతో టీఎంసీ ఉన్నప్పటికీ, పరిస్థితి ఎలా అదుపు తప్పింది? అనేది ప్రస్తుతం మనం అడగాల్సిన ప్రశ్న'' అని ముర్షిదాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు అన్నారు. 'ఎందుకంటే, దుకాణాలను తగలపెట్టేటప్పుడు పోలీసులు చర్యలు తీసుకునేందుకు నిరాకరించారు. వారికి సమాచారం అందిన వెంటనే చర్యలు తీసుకోవడానికి స్థానిక అథారిటీలు నిరాకరించడంతోనే ఇలా జరిగిందని నాకు తెలిసింది.'' అని తెలిపారు.

## మళ్లీ ప్రారంభిస్తాం

రు. 1930లో కాలారం ఆలయ ప్రవేశం చేయడమే కాకుండా తన వెంట దళితులను ఆలయానికి తీసుకెళ్లారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చాక తొలి మంత్రివర్గంలో కీలకపాత్ర పోషించారు. సామాజిక న్యాయం, మౌలికహక్కులు, సమానత్వం గురించి రాజ్యాంగంలో పొందుపరిచారు. రాజ్యాంగం ఒక పేపరో, పుస్తకం కాదు... పవిత్రమైన గ్రంథం. భారత ప్రజాస్వామ్యానికి దశ, దిశా నిర్దేశించిన వ్యక్తి అంబేద్కర్. ఆయన ఏ ఒక్కరి వ్యక్తో, ఓ వర్గానికో ప్రతినిధి కాదు.. మనందరివాడు.

**దళితుల సంక్షేమం టీడీపీతోనే :**

పార్టీ ఆవిర్భావం నుంచి దళితుల సంక్షేమానికి తెలుగుదేశం పెద్దపీట వేస్తోంది. 2002లో ముందగుడు కార్యక్రమం పెట్టాం. స్టడీ సెంటర్లు పెట్టి ఎస్సీ, ఎస్టీ పిల్లలను చదవించాం. అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకం ద్వారా పేద విద్యార్థులను చదివిస్తాం. ఈ పథకాన్ని మరింత మెరుగుపరుస్తాం. గతంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ. 15 లక్షలు, బీసీ, ఈబీసీ, కాపు, మైనారిటీ విద్యార్థులకు రూ. 10 లక్షలు ఆర్థిక సాయం చేశాం. సుమారు 7 వేల మందిని చదవించాం. ఇందుకోసం రూ. 467 కోట్లు వెచ్చించాం. 20142019 మధ్య 619 మంది ఎస్సీ విద్యార్థులకు, 55 మంది ఎస్టీ విద్యార్థులను చదివించాం. ఇందుకోసం రూ. 50 కోట్లు వ్యయం చేశాం. గత ప్రభుత్వం కేవలం 430 మందినే చదివించింది. దీన్నిబట్టి పేదలపై వారికి ఏమాత్రం ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చు. సబ్ ప్లాన్ తెచ్చాం. ఎస్సీ రైతుల కోసం రూ. 1,300 కోట్లు, హార్టికల్చర్ రంగంలోని ఎస్సీల కోసం రూ. 130 కోట్లు, ఇళ్ల నిర్మాణానికి రూ. 1,253 కోట్లు, గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ. 1,200 కోట్లు, జలజీవన్ మిషన్ కింద రూ. 478 కోట్లు ఖర్చు చేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా 1,241 ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో 2 లక్షల 35 వేల 600 మంది విద్యార్థులున్నారు. వారికి రూ.1,331 కోట్లు ఖర్చు చేస్తున్నాం. రాష్ట్రంలో 21 లక్షల పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఉన్నాయి. వారి కోసం 200 యూనిట్లు కరెంటు ఉచితంగా ఇస్తున్నాం. మీ ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ పెట్టి కరెంటు ఉత్పత్తి చేసి 200 యూనిట్లు వాడుకుని మిగిలింది ప్రభుత్వానికి ఇస్తే రూ. యూనిట్ కు 2.09 పైసలు ఇస్తాం. దీనివల్ల మీ ఆదాయం పెరుగుతుంది. నెలకు మీరు 100 యూనిట్లు ఇస్తే రూ. 210 రూపాయిలు మీ అకౌంట్‌లో పడతాయి. ఏడాదికి రూ.2500 నుంచి 3000 వేల వరకూ అదనపు ఆదాయం వస్తుంది. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఇల్లు కట్టుకునేందుకు 50 వేలు అదనంగా డబ్బు ఇస్తాం. ఇందుకోసం రూ. 780 కోట్లు ఇందుకు ఖర్చవుతుంది. ఏ సమాజం పురోగతి అయినా ఆ సమాజంలోని బలహీన వర్గాల పురోగతిపై ఆధారపడుతుందని అంబేద్కర్ అన్నారు. ఒక ప్రముఖ వ్యక్తికి గొప్ప వ్యక్తికి వ్యత్యాసం ఏమంటే గొప్పవ్యక్తి సమాజసేవకుడిగా ఉండేందుకు సిద్ధపడతాడు. గొప్ప వ్యక్తి కావాలంటే పేదలకు అండగా నిలబడి వారిని పైకి తేవాలి. అప్పుడు మీరు గొప్ప వ్యక్తులవుతారు. నేను ఇచ్చిన మాట ప్రకారం పేదలకు అండగా నిలబడతాను. పేదలే దేవుళ్లు సమాజమే దేవాలయం అని చెప్పిన ఎన్టీఆర్ స్ఫూర్తితో ముందుకెళ్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు మంచి స్థానాల్లో ఉన్నారు. 2047 నాటికి దేశంలోనే నెంబర్ వన్ స్టేట్‌గా ఏపీ నిలుస్తుంది.

**ప్రపంచంలోనే మేటి నగరంగా అమరావతి :**

గత ప్రభుత్వంలో పాలకులు అమరావతిని చంపేశారు. ఎడారి, స్మశానం అని ఎగతాళి చేశారు. మూడు రాజధానుల పేరుతో అమరావతిపై విష ప్రచారం చేశారు. కులం, మతం, ప్రాంతాల వారీగా వైషమ్యాలు రగిల్చిన వారికి ప్రజలు బుద్ధి చెప్పారు. ప్రజల ఆశీస్సులతో అమరావతిని అత్యద్భుతంగా తీర్చిదిద్దుతాం. అమరావతికి దేశంలోని ప్రఖ్యాత విద్యాసంస్థలు రాబోతున్నాయి. ఇప్పటికే ఎస్ఆర్ఎమ్, విట్ కొలువుదీరాయి. అన్ని కాలేజీలను తీసుకొచ్చి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తాం.

**కూటమి పాలనలో ప్రజలకు స్వేచ్ఛ :**

నేను నా ప్రజలకు ఆయుధం ఇవ్వలేదు. దానికి బదులుగా ఓటుహక్కు ఇచ్చాను. దాన్ని ఉపయోగించుకుని ధీరుడిగా అవుతారో, లేక దానిని అమ్ముకుని బానిసలుగా మారతారో వారి చేతుల్లో ఉందని అంబేద్కర్ అన్నారు. మొన్నటి ఎన్నికల్లో సరిగ్గా అదే జరిగింది. మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకుని ఆంధ్రప్రదేశ్ ఓటర్లు అందరూ ధీరులమని నిరూపించుకున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక ప్రజలకు స్వేచ్ఛ లభించింది. గత ప్రభుత్వంలో ఐదేళ్లు మాట్లాడాలంటేనే ప్రజలు భయపడ్డారు. నేను ఎప్పుడూ చూడని రాజకీయం ఆ ఐదేళ్లలో చూశాను. నాలాంటి వారు కూడా బయటకు రాలేని పరిస్థితి. కష్టాలన్నీ పోయాయి. మన పాలనలో స్వర్ణయుగం రానుంది. గత పాలనలో ప్రజలను సభలకు బలవంతంగా తీసుకొచ్చేవారు. ప్రజలు పారిపోతుంటే చుట్టూ కందకాలు తవ్వారు. పాలకులు హెలికాప్టర్‌లో వస్తుంటే కింద చెట్లు కూల్చేవారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడమే కాకుండా నష్టపోయిన రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయాలనే ఉద్దేశంతో జనసేన, బీజేపీతో కలిసి కూటమిగా ఎన్నికలకు వెళ్లాం. అద్వితీయమైన గెలుపును ప్రజలు అందించారు. 10 నెలల్లో ఊహించిన దానికంటే ఎక్కువే చేశాం. చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా సూపర్ సిక్స్ ద్వారా పేదలకు అండగా నిలబడ్డాం. దీపం 2 పథకం ద్వారా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నాం. ఓ వైపు సంక్షేమం అభివృద్ధి, మరోవైపు సుపరిపాలన... ఇదే ఎన్డీఏ ప్రభుత్వ విధానమని గర్వంగా చెబుతున్నాను.

**కుల వివక్షపై పోరాడాం :**

పార్టీ ఆవిర్భావం నుంచి కుల వివక్షతపై తెలుగుదేశం యుద్ధం చేసింది. 694 జీవో ప్రకారం జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కార కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశాం. అధికారులంతా వారానికోసారి గ్రామానికి వెళ్లేలా ఆదేశాలిచ్చాం. కుల వివక్ష చూపే వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టేందుకు ఆదేశాలు ఇచ్చాం. దేవాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో అంటరానితనం నిర్మూలనకు చర్యలు తీసుకున్నాం. ఎస్సీ అట్రాసిటీ కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక కోర్టులు పెట్టాం. మొదటిసారిగా దళితుణ్ణి లోక్ సభ స్పీకర్‌ని చేసిన ఘనత తెలుగుదేశానిదే. ఎస్సీ బిడ్డ బాలయోగి స్పీకర్‌గా బ్రహ్మాండంగా రాణించి దేశాన్ని మెప్పించారు. 1999లో దళిత మహిళ ప్రతిభా భారతిని అసెంబ్లీ స్పీకర్‌ని చేసిన ఘనత కూడా తెలుగుదేశానికే దక్కింది. ఎన్టీఆర్ నేషనల్ ఫ్రంట్ అధ్యక్షునిగా ఉన్నప్పుడే బి.ఆర్. అంబేద్కర్‌కి భారతరత్న వచ్చింది. ఎన్డీఏ ప్రభుత్వంలోనే అంబేద్కర్ గారి ఫోటో పార్లమెంటులో పెట్టారు. నేను యునైటడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉన్నప్పుడు ఎస్సీ వర్గానికి చెందిన కే. ఎల్. నారాయణన్ రాష్ట్రపతిని చేశాం. నాటి ప్రధాని వాజ్ పేయి సహకారంతో అబ్దుల్ కలామ్‌ని రాష్ట్రపతిని చేయడంలోనూ టీడీపీ పాత్ర ఉన్నందుకు గర్వంగా ఉంది.

**అర్హులందరికీ సంక్షేమం :**

ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షితమైన నీరు, అర్హులకు ఉచిత కరెంటు, ఇండ్లపై సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటు, ఇంటర్నెట్, మరుగుదొడ్ల నిర్మాణం, సొంతింటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఒకప్పుడు రోడ్లు సరిగా ఉండేవి కావు. టెలిఫోన్ సౌకర్యం సరిగా లేదు. ఒకప్పుడు చదువుకోవాలంటే స్కూళ్లు లేవు, ప్రభుత్వం, ప్రవేటు భాగస్వామ్యంలో అన్నీ వచ్చాయి. ఒకప్పుడు ప్రభుత్వ లైసెన్స్ వస్తేనే ఇండస్ట్రీ పెట్టాలి. ఇప్పుడు తెలివి ఉంటే చాలు ఇండస్ట్రీ పెట్టొచ్చు. ఆదాయంతో పాటు ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. దీన్ని అరికట్టాలి.

**విద్యార్థులతో వర్చువల్‌గా మాట్లాడిన సీఎం చంద్రబాబు :**

టీడీపీ హయాంలో ప్రవేశపెట్టిన అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకం ద్వారా విదేశాల్లో ఉన్నత చదువులు అభ్యసించి నేడు మంచి ఉద్యోగం చేస్తున్న వారితో ప్రజావేదిక నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా మాట్లాడారు.

**కొరివి రత్నలత, నెట్‌వర్క్ ఇంజినీర్, ఆస్ట్రేలియా :**

ముందుగా అంబేద్కర్ విదేశీ విద్యా పథకం ద్వారా నాకు ఆర్థిక సాయం చేసి నేను ఇంతటి ఉన్నతస్థానంలో ఉండేలా సహకరించిన సీఎం చంద్రబాబుకి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. మాది గుంటూరు జిల్లా వేములూరుపాడు గ్రామం. దిగువ మధ్య తరగతి కుటుంబం. 2014లో బీటెక్ కంప్యూటర్ సైన్స్ చేశాను. విదేశీ విద్యా పథకం గురించి తెలుసుకుని నా తండ్రి అప్లయ్ చేయమన్నారు. నాకు పథకం కింద రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందింది. విదేశీ విద్యతో నా జీవితం మారిపోయింది. సార్ ... మీరు చేసిన సాయం జీవితంలో మర్చిపోలేను. యువతకు మీరు ఆదర్శం.

**రత్నలత తండ్రి :**

నా బిడ్డ ఉన్నతికి కారణమైన సీఎం చంద్రబాబు కి జీవితాంతం రుణపడి ఉంటానంటూ రత్నలత తండ్రి భావోద్వేగానికి లోనయ్యారు. చంద్రబాబు గారు చేసిన సాయం ఎప్పటికీ మర్చిపోమని కంటనీరు పెట్టారు.

**చంద్రబాబు, ఏపీ సీఎం :**

మారుమూల గ్రామంలో పుట్టిన ఆడబిడ్డ ఆస్ట్రేలియాలో పై చదువులు చదివి ఇంజినీర్ అయినందుకు గర్వపడుతున్నాను. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని యువత మరింత పైకి రావాలి.

**అనిల్, ఇంజినీర్, కెనడా :**

మాది గుంటూరు జిల్లా తెనాలి. తెలుగుమీడియంలో చదివాను. అంబేద్కర్ విదేశీ విద్యా పథకం ద్వారా కెనడాలో మాస్టర్స్ చదివే అవకాశం వచ్చింది. మాది వ్యవసాయ కుటుంబం. నా తల్లిదండ్రులు చదువుకోలేదు. మా అమ్మమ్మ రోడ్లు ఊడ్చి నన్ను చదివించింది. నాకు పథకం కింద రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందింది. నేనిప్పుడు ఏడాదికి రూ. 60 లక్షలు సంపాదిస్తున్నానంటే అందుకు చంద్రబాబు గారే కారణమని గర్వంగా చెబుతున్నాను.

**చంద్రబాబు, ఏపీ సీఎం :**

మేము రూ. 10 లక్షలు సాయం చేస్తే ఇప్పుడు అనిల్ రూ. 60 లక్షలు సంపాదిస్తున్నాడు. భవిష్యత్‌లో రూ. కోటి సంపాదించాలని కోరుకుంటున్నాను. చాలా ఆనందంగా ఉంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు చేరిన వారిని చూస్తే గర్వంగా అనిపిస్తుంది. అనిల్, రత్నలత లాంటి వారిని యువత ఆదర్శంగా తీసుకోవాలి. బాగా చదువుకుంటే జీవితంలో మంచిగా స్థిరపడొచ్చు. ఇష్టపడి చదువుకుంటే కష్టం కూడా ఇష్టం అవుతుంది. అప్పుడు మీ లక్ష్యం తేలిగ్గా చేరుకోవచ్చు. అంబేద్కర్ జయంతి రోజున మీరు పీ4 కార్యక్రమం కింద ఒకటి లేదా రెండు కుటుంబాలను అనిల్, రత్నలత దత్తత తీసుకోవాలని సూచించారు. కర్మభూమిలో పని చేయండి. జన్మభూమిని మర్చిపోవద్దు అని సీఎం చెప్పారు. ముఖ్యమంత్రి సూచనతో సొంతూరిలో పేద కుటుంబాలను దత్తత తీసుకునేందుకు అనిల్, రత్నలత ముందుకొచ్చారు.

# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

- అంబేద్కర్ కు ఘన నివాళి అర్పించిన పలువురు నేతలు
- అంబేద్కర్ జీవితం అందరికీ స్ఫూర్తి దాయకం : భీమిడి జైపాల్ రెడ్డి

**జయభేరి, ఏప్రిల్ 14:**



తూంకుంట మున్సిపల్ పరిధిలో రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని దేవరయాంజల్, తుంకుంట, మరియు గ్రంథాలయం ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, అధికారులు హాజరై అంబేద్కర్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం ఆధునిక భారతదేశం కోసం అలుపెరుగని పోరాటం చేసిన నాయకుడు అంబేద్కర్ అని కొనియాడారు. భారత దేశ ఔన్నత్యాన్ని ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లో అందరూ నడుచుకొని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా రీజనల్ ట్రాన్స్ పోర్ట్ అథారిటీ మెంబర్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి,శామీర్ పేట్ మండల మాజీ ఎంపీపీ నాలిక యాదగిరి,జాతీయ కళా మండలి అధ్యక్షులు యన్ వై అశోక్, రాష్ట్ర దళిత సమైక్య అధ్యక్షులు బి.ఎన్ రామ్మోహన్, జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు బంగర గళ్ళ శంకర్, మాజీ కౌన్సిలర్లు సింగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, బోల్లబోయిన రాజు యాదవ్, మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు పట్నం నర్సింహ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు చీరాల యాదగిరి, రామాలయం మాజీ ధర్మకర్తలు పట్నం నర్సింహ రెడ్డి, బక్కొల శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు సింగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, గుంతల కృష్ణా రెడ్డి, బక్కొల నర్సింగ్ రావు, నూనె ముంతల రవీందర్ గౌడ్, బెంబడి జంగారెడ్డి, టీ ఆర్ రవీందర్ గౌడ్, రంగప్పగారి నాగరాజ్ గౌడ్, మన్నే బిక్షపతి, గట్టు ప్రదీప్ కుమార్, శ్రీకాంత్, కత్తి వెంకటేశ్, వజ్జల శశాంత్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేష్, యూత్ నాయకులు కత్తి మహేష్, చింతల మణిదీప్ రెడ్డి, కత్తి భరత్,మున్సిపల్ సిబ్బంది రేణుక, భార్గవి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి

- మద్దుల శ్రీనివాస్ రెడ్డి

**జయభేరి, మేడ్చల్ :**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మద్దుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని గుండ్లపోచంపల్లి కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మద్దుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి వన్నె తెచ్చిన గొప్పవ్యక్తి బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. దేశానికి సేవలందించిన మహనీయులు నేటితరనికి గుర్తు ఉండాలంటే వారి గొప్పతనాన్ని, వారు దేశానికి చేసిన సేవలు నేటి సమాజానికి తెలియాల్సి అవసరం ఉందన్నారు. వారి జయంతి, వర్ధంతి రోజుల్లో మహనీయులకు నివాళీలు అర్పించడం ద్వారా వారిని గౌరవించుకున్న వాళ్ళం అవుతామని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షుడు మండల సంజీవ్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు అమరం జైపాల్ రెడ్డి, అమరం హేమంత్ రెడ్డి, భేరి బాలరాజు, నాయకులు సురేందర్ గౌడ్, జనార్ధన్ రెడ్డి, బాల చారి, రాకేష్, నర్సింగ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి



**జయభేరి, దేవరకొండ :**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పూలమాలవేసి ఘన నివాళి అర్పిస్తున్న PRTU TS దేవరకొండ మండల శాఖ అధ్యక్షులు కొర్ర లోక్య నాయక్, ప్రధాన కార్యదర్శి దారం దామోదర్, మాజీ సీనియర్ నాయకులు సుగుణయ్య లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# అందరి వాడు అంబేద్కర్

**జయభేరి, తుంగతుర్తి :**



డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134 జయంతి సందర్భంగా తుంగతుర్తి గ్రామంలోని బొడ్రాయి సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనమైన నివాళులర్పించిన. మాల మహానాడు కేతపల్లి మండల అధ్యక్షుడు మెరుగుమళ్ళ బిక్షం ఈసందర్భంగా మాట్లాడుతూ..బడుగు బలహీన వర్గాలు, మహిళల సాధికారతకు పాటుపడిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. దేశ భవిష్యత్తును ముందుగానే ఊహించి దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్ భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచాడని ప్రజల హక్కుల కోసం పోరాడి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ కట్టుబడి ఉండాలని అన్నారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగమే తెలంగాణ రాష్ట్రానికి జవజీవం పోసిందని గుర్తు చేసుకున్నారు. ఆయన స్ఫూర్తితోనే ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతుందని అన్నారు. దళితుల అభ్యున్నతిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీల సమగ్రాభివృద్ధికి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో అడుగులు వేస్తుందనఅని అన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి కార్యదర్శి రాణి, తుంగతుర్తి మాజీ ఎంపీటీసీ కీర్తి వెంకన్న గౌడ్, కేతపల్లి మాజీ ఎంపిటిసి మట్టి సాల్మన్, బొప్పని నాగరాజు, కుకుట్ల బాలస్వామి, అంజి, గాదరి సతీష్, ఉపేందర్, బిక్షం, రాజు, గాదరి జంపన్న, బొప్పని కిషోర్, మేకల నరేష్, కోటయ్య, మోహన్, నరేష్, గని భాస్కర్, నాగయ్య, జార్జి వెంకటేశం, అంగన్వాడి టీచర్ పురం కలమ్మ, మనమ్మ, కౌసల్య, నాయకులు, గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీ జాగా.. వేసేయ్ చెత్త

- ఖాళీ ప్లాట్లలో పెరుకుపోతున్న చెత్త
- అవస్థలు పడుతున్న ప్రజలు
- అధికారులు చర్యలు తీసుకోవలంటున్న స్థానికులు

**జయభేరి, మేడ్చల్ :**



గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఖాళీ స్థలాలు, వ్యర్థాలకు నిలయంగా మారుతున్నాయి. పిచ్చి మొక్కలు, కంపచెట్లు, చెత్తదిబ్బలతో ఖాళీ స్థలలు అధ్వానంగా తయారయ్యాయి. మున్సిపాలిటీ పరిదిలోని అయోధ్య కమల నగర్ కాలనిలో రోజుల తరబడి చెత్తను తరలించకపోవడంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా ఎలుకలు, పంది కొక్కులు, పందులు, విషపురుగులకు ఆవాసాలుగా మారాయి. నివాసాల మధ్య ఇలా ఉన్న ఖాళీ స్థలాలతో పక్కన నివసించే ప్రజలకు అసౌకర్యంగా ఉంది. ఉదయం దుర్వాసన, సాయంత్రం నుంచి దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు ఎలాంటి కంచె లేకపోవడంతో స్థానికులు చెత్తచెదారం, ఇతర వ్యర్థాలు పడేస్తుండడంతో అవి కాస్త చెత్త దిబ్బలుగా ఏర్పడి దుర్వాసన వెదజల్లుతున్నాయని, దీని ద్వారా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నట్లు ప్రజలంటున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే చెత్తదిబ్బలు తొలగించాలని కోరుతున్నారు.సాధారణంగా అధికారులు ఖాళీ స్థలాలు గుర్తించి, వాటిపై పన్నులు వసూలు చేయాల్సి ఉంది. అపరిశుభ్రత ఉంటే శుభ్రం చేయించాలి. పిచ్చి మొక్కలు, చెట్లు పెరగకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలి. పందులు, ఎలుకలు, విషపురుగులు చేరకుండా చుట్టూ కంచె ఏర్పాటు తదితర చర్యలు తీసుకోవాలి. ఇరుగుపొరుగువారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆ స్థలాల యజమానులపై ఉంది. ఇవేవీ పట్టించుకోని స్థల యజమానులకు నోటీసులిచ్చి, స్పందించకపోతే మున్సిపాలిటీ అధికారులే వాటిని శుభ్రం చేసి, దానికి అయ్యే ఖర్చును యజమానుల నుంచి వసూలు చేయాలి.

### లోపించిన పారిశుధ్యం..

లక్ష కన్నా తక్కువ జనాభా ఉన్న జోనల్ అవార్డు క్యాటగిరీలో గతంలో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి సౌత్‌జోన్ క్లీనెస్ట్ సిటీ అవార్డు దక్కిందనా మున్సిపాలిటీలోని పలు కాలనిలలో పారిశుధ్యం పరిస్థితి మాత్రం ఎక్కడ చేసిన గొంగళి అక్కడే అనే విధంగా ఉంది. ఖాళీ జాగా కనిపిస్తేచాలు కొన్నిరోజుల్లోనే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇళ్ల మధ్య ఖాళీ స్థలం ఉందా. వేయండి చెత్త అనే ధోరణి కనిపిస్తోంది. గతంలో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు ఇచ్చినా మున్సిపాలిటీలో కొందరు తమ ధోరణి మార్చుకోలేకపోతున్నారు. ఏదైతే ఏమైతదిలే అన్నట్లు ఇంటిపక్కన ఉన్న ఖాళీ స్థలాలను చెప్ప కుప్పలుగా మార్చేస్తున్నారు. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు కుప్పలుకుప్పలుగా దర్శనమిస్తున్నాయి. అక్కడక్కడ కాలనీల్లో చెట్ల మధ్య చెత్త ఇరుక్కోవడంతో పాటు మురుగుతో కంపు కొడుతోంది. దాంతో ఈగలు, దోమల బెడదకూడా ఎక్కువవుతోంది. మున్సిపాలిటీ చెత్త వాహనాలు బస్తీల్లో తిరుగుతున్నా. వాటిలో చెత్త వేయకుండా కొందరు ఆరుబయటే వేస్తున్నారు. చెత్తకవర్లను పందులు ఆవాసంగా మార్చుకుంటున్నాయి.

### చెత్త ఆరుబయట వేస్తే చర్యలు

**స్వామి నాయక్,**
**కమిషనర్ గుండ్లపోచంపల్లి**

ఇప్పటికే మున్సిపాలిటీలో ఇంటింటికీ చెత్త బుట్టలు పంపిణీ చేశాం. ఆరుబయట చెత్త వేయొద్దని ప్రచారం చేశాం. ఇంటితోపాటు చుట్టూ పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటుందనేది అందరికీ తెలిసిందే. తమ సిబ్బందితో ఎప్పటికప్పుడు వీధుల్లో కూడా శుభ్రం చేయిస్తున్నాం. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పాం. ఆరుబయట చెత్త వేస్తే జరిమానా విధించి తగు చర్యలు తీసుకుంటాం.







## చిరస్మరణీయుడు అంబేద్కర్

- గుండ్లపోచంపల్లిలో ఘనంగా రాజ్యాంగ నిర్మాత జయంతి
- వేడుకల్లో పాల్గొన్న అఖిలపక్ష నేతలు

**జయభేరి, మేడ్చల్ :**

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని బీజేపీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి అన్నారు. సోమవారం బాబా సాహెబ్ జయంతిని పురస్కరించుకుని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని అంటరానితన్నాన్ని నిర్మూలించేందుకు అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన రాజ్యాంగం ద్వారా సమాజంలోని అన్ని వర్గాల వారికి సమన్యాయం చేశారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, భేరి ఈశ్వర్, బీజేపీ మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్, మాజీ ఎంపీటీసీ ఉషిగారి శ్రీనివాస్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్, నాయకులు గడిలా కృష్ణా రెడ్డి, దొడ్ల మోహన్, బట్టికడి విజయ్, జనార్ధన్ రెడ్డి, కిషన్, ముక్కిడిగాళ్ల మహేష్, సుంకు నవీన్, చెంచాల సురేష్, భేరి భాను చందర్, కిరణ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## శామీర్ పేటలో అగ్నిమాపక వారోత్సవాలు

- వారోత్సవాలను జెండా ఊపి ప్రారంభించిన సీఐ శ్రీనాథ్




**జయభేరి, ఏప్రిల్ 14:**

శామీర్ పేట అగ్నిమాపక కార్యాలయంలో అగ్ని మాపక వారోత్సవాలు నిర్వహించారు. ఈ వారోత్సవాల ప్రారంభోత్సవానికి సీఐ శ్రీనాథ్, ఫైర్ ఆఫీసర్ వెంకటరమణరెడ్డి లు హాజరై జెండా ఊపి వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఫైర్ సిబ్బంది కలిసి స్మారక ఊరేగింపు నిర్వహించి ప్రమాదాల నివారణపై ఏర్పాటు చేసిన ప్రత్యేక పోస్టర్ ను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ వారోత్సవాలు నిర్వహించడం వల్ల ప్రజల్లో అగ్ని ప్రమాదాలను ఎలా నివారించాలి అని అవగాహన కల్పించవచ్చునన్నారు. అదేవిధంగా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు రక్షించుకోవడానికి తగిన చర్యలు మరియు అత్యవసర నంబర్లను పోస్టర్ లో అందుబాటులో ఉంచినట్లు వారు వెల్లడించారు.

## రాజ్యాంగం నిర్మాత భీంరావు రాంజీ అంబేద్కర్ జయంతి




**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండ యందు మన దేశ రాజ్యాంగం నిర్మాత, న్యాయవాది, సంఘ సంస్కర్త 134వ జయంతి సందర్భంగా ప్రధాన కార్యదర్శి అంకం చంద్రమౌళి, కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్ వారి చిత్రపటానికి పూలమాల అలంకరించి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించినారు. వారు మాట్లాడుతూ.. అంబేద్కర్ సేవలను కొనియాడినారు. ముఖ్యంగా రాజ్యాంగం నిర్మాణంలో వారి పాత్ర మరువలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు మోటమర్రి పురుషోత్తం, మునిని వీరయ్య, బొలుసాని సత్యనారాయణ అస్సం పాండరయ్య, కాశిమల్ల చెన్నయ్య, అప్పం వీరయ్య, లక్ష్మయ్య, గడ్డం బిక్షమయ్య, మహమ్మద్ మౌలానా తదితరులు పాలుగోన్ని నివాళులు అర్పించారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి




**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల యందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు విద్యార్థినిలు, అధ్యాపకులు పూలమాల వేసి నివాళులర్పించారు.బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన, పాటల పోటీ ఉపన్యాస పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు అత్యుత్సాహంగా పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం హరిప్రియ తెలియజేశారు.



# చెన్నై హమ్మయ్య!

## ఉత్కంఠ పోరులో లక్నోపై గెలుపు

ఐపీఎల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ వరుస ఓటములకు ఫుల్‌స్టాప్ పడింది. ప్లేఆఫ్స్ రేసులో నిలువాలంటే తప్పక గెలువాల్సిన మ్యాచ్‌లో సత్తాచాటింది. సోమవారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో చెన్నై 5 వికెట్ల తేడాతో లక్నో సూపర్‌జెయింట్స్‌పై విజయం సాధించింది. లక్నో నిర్దేశించిన 167 పరుగుల లక్ష్యాన్ని చెన్నై 5 వికెట్లు కోల్పోయి 19.3 ఓవర్లలో 168 స్కోరు చేసింది. శివమ్ దూబే(37 బంతుల్లో 43 నాటౌట్, 3 ఫోర్లు, 2సిక్స్‌లు), ధోనీ(11బంతుల్లో 26 నాటౌట్, 4ఫోర్లు, సిక్స్) జట్టు విజయంలో కీలకమయ్యారు.

బిష్ణోయ్ (2/18) రెండు వికెట్లు తీశాడు. తొలుత టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన లక్నో.. 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 166 పరుగులకే పరిమితమైంది. రిషభ్ పంత్ (49 బంతుల్లో 63, 4 ఫోర్లు, 4 సిక్సర్లు) ఈ సీజన్‌తో తొలి అర్ధ సెంచరీతో రాణించగా మిచెల్ మార్ష్ (30) ఫర్వాలేదనిపించాడు. చెన్నై బౌలర్లలో జడేజా (2/24), పతిరాన (2/45) తలా రెండు వికెట్లు తీశారు. వికెట్లు పడకపోయినా నూర్ అహ్మద్.. 4 ఓవర్లలో 13 పరుగులే ఇచ్చి లక్నోను కట్టడి చేశాడు.

స్వల్ప ఛేదనలో లక్నో మాదిరిగానే చెన్నై కూడా తడబడింది. సీఎస్‌కేకు తొలి మ్యాచ్ ఆడిన ఆంధ్ర కుర్రాడు షేక్ రషీద్ (19 బంతుల్లో 27, 6 ఫోర్లు) సాధికారికంగా బ్యాటింగ్ చేశాడు. రచిన్‌తో కలిసి అతడు తొలి వికెట్‌కు 4.5 ఓవర్లలోనే 52 పరుగులు జతచేశాడు. ఈ సీజన్ పవర్ ప్లేలో ఫిఫ్టీ ప్లస్ స్కోరు చేయడం చెన్నైకి ఇది రెండోసారి మాత్రమే. అయితే అవేశ్ ఖాన్ రాకతో చెన్నై వికెట్ల పతనం మొదలైంది. అతడి 5వ ఓవర్లో రషీద్.. పూరన్‌కు క్యాచ్ ఇవ్వడంతో చెన్నై ఇన్నింగ్స్ తడబడింది. క్రీజులో కుదురుకున్న రచిన్.. మార్క్మ్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరిగాడు. బిష్ణోయ్ రంగప్రవేశంతో సీఎస్‌కే కష్టాలు రెట్టింపయ్యాయి. బిష్ణోయ్ 13వ ఓవర్‌లో జడేజా(7) పెవిలియన్ చేరగా, ఓవర్ తేడాతో దిగ్వేశ్ బౌలింగ్‌లో విజయ్ శంకర్(9) పెవిలియన్ చేరాడు. దీంతో 111 పరుగులకే చెన్నై 5 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో శివమ్ దూబే, కెప్టెన్ ధోనీ..లక్నో బౌలర్లకు ఎదురొడ్డి నిలుస్తూ చెన్నైకి కీలక విజయాన్ని అందించారు.

స్పిన్నర్లకు సహకరించే ఏకనా పిచ్‌పై లక్నో ఇన్నింగ్స్ పడుతూ లేస్తూ సాగింది. టాపార్డర్ వైఫల్యంతో ఆ జట్టు ఈ సీజన్‌లో అత్యల్ప స్కోరు నమోదు చేసింది. బంతి దొరికితే స్టాండ్స్‌లోకి పంపిస్తూ పవర్ ప్లేలో వీరవిహారం చేసే బ్యాటింగ్ ద్వయం మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్ (9 బంతుల్లో 8) సైతం చెన్నై బౌలర్ల ధాటికి నిలువలేకపోయారు. మొదటి ఓవర్‌లోనే ఖలీల్ (1/38).. మార్క్‌మ్‌ను ఔట్ చేసి చెన్నైకి తొలి బ్రేక్‌నిచ్చాడు. భీకర ఫామ్‌లో ఉన్న పూరన్‌ను అన్షుల్.. 4వ ఓవర్లో వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. తొలి 6 ఓవర్లలో లక్నో స్కోరు 42/2 మాత్రమే. పూరన్ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన పంత్.. ఓవర్టన్ బౌలింగ్‌లో సిక్సర్‌తో జట్టు స్కోరును 50 పరుగుల మార్కును దాటించాడు.

క్రీజులో నిలదొక్కుకునేందుకు తంటాలు పడ్డ మార్ష్‌ను.. 10వ ఓవర్లో జడ్డూ క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఓ బౌండరీ, రెండు సిక్సర్లతో ధాటిగా ఆడిన బదోని (22).. జడేజా బౌలింగ్‌లో ముందుకొచ్చి ఆడేందుకు యత్నించగా ధోనీ స్టంపౌట్‌తో అతడి ఇన్నింగ్స్ ముగిసింది. స్పిన్నర్ల రాకతో లక్నోకు పరుగుల రాక మందగించింది. ముఖ్యంగా నూర్ అహ్మద్ బౌలింగ్‌లో పంత్ తంటాలు పడ్డాడు. 39 బంతుల్లో 40 పరుగులు చేసిన పంత్.. ఆ తర్వాత పతిరాన బౌలింగ్‌లో గేర్ మార్చి 2 సిక్సర్లు బాది ఈ సీజన్‌లో తొలి అర్ధ శతకాన్ని నమోదుచేశాడు. ఆఖర్లో సమద్ (20) రెండు భారీ సిక్సర్లు కొట్టాడు. పతిరాన వేసిన ఆఖరి ఓవర్లో మూడు వికెట్లు పడటంతో లక్నో తక్కువ స్కోరుకే పరిమితమైంది.

1 .ఐపీఎల్‌లో అత్యధిక(201) ఔట్లలో భాగమైనవారిలో చెన్నై వికెట్‌కీపర్ ధోనీ అగ్రస్థానంలో ఉన్నాడు. కార్తీక్(182), డివిలీర్స్(126), ఉతప్ప(124) ఆ తర్వాత ఉన్నారు.


**సంక్షిప్త స్కోర్లు**

లక్నో: 20 ఓవర్లలో 166/7 (పంత్ 63, మార్ష్ 30, జడేజా 2/24, పతిరాన 2/45)

చెన్నై: 19.3 ఓవర్లలో 168/5(దూబే 43 నాటౌట్, రవీంద్ర 37, బిష్ణోయ్ 2/18, దిగ్వేశ్ 1/23)

# టాటూలు అంటే ఇష్టమా..?

- ప్రస్తుతం టాటూలకు క్రేజ్ భారీగా ఉన్నది. ముఖ్యంగా యువత టాటూలు వేయించుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. మొన్నటి వరకు విదేశాల్లోనే ఎక్కువగా కనిపించిన ఈ టాటూ సంస్కృతి ఇప్పుడు భారత్‌లోనూ కనిపిస్తున్నది. అయితే స్టయిలిష్‌గా కనిపించేందుకు టాటూలు వేయించుకునేందుకు ఇష్టపడుతున్నారు. అయితే, ఈ టాటూలతో ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని పలు అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. టాటూలు వేయించుకోవడం.. ఆ తర్వాత వాటిని తొలగించడం రెండూ ఆరోగ్యానికి ప్రమాదమేనని చెబుతున్నాయి. స్వీడల్‌లో ఇటీవల నిర్వహించిన ఓ అధ్యయనంలో టాటూ వేయించుకోవడం, దాన్ని తొలగించడం వల్ల లింఫోమా ప్రమాదం పెరుగుతుందని శాస్త్రవేత్తల బృందం గుర్తించింది. లింఫోమా అనేది ఒక రకమైన చర్మం క్యాన్సర్. టాటూ వేయించుకోవడం వల్ల చర్మం ఇన్ఫెక్షన్, అలెర్జీ, మచ్చలు వంటి సమస్యలు సహా అనేక ప్రమాదాలుంటాయని ఆరోగ్య నిపుణులు పేర్కొన్నారు. లైసెన్స్ లేని చోట్ల టాటూలు వేయించుకున్న వ్యక్తుల గాయాలు చాలాకాలం పాటు నయం కాలేదని.. తీవ్రమైన ఇన్ఫెక్షన్ సైతం బారినపడ్డారని నివేదిక తెలిపింది.



**టాటూలపై తొలుగుతున్న భ్రమలు..**

నిపుణుల బృందం టాటూ వేయించుకున్న, తొలగించుకునేందుకు క్లినిక్‌లకు వెళ్తున్న వ్యక్తులపై అధ్యయనం చేసింది. ప్యూ రీసెర్చ్ ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం.. 25శాతం మంది ఇప్పుడు టాటూలు వేయించుకున్నందుకు పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నారు. న్యాచురల్ లుక్‌పై మళ్లీ కోరిక పెరుగుతోందని.. యూఎస్, యూరప్‌లో ప్రస్తుతం చాలామంది టాటూలకు దూరంగా ఉంటున్నారు. టాటూలు తమ చర్మ సహజ సౌందర్యాన్ని ప్రభావితం చేస్తున్నాయని జనం విశ్వసిస్తున్నారని నివేదిక పేర్కొంది. అందుకే ఇప్పుడు ప్రజలు తమ టాటూలను తొలగించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. వ్యక్తిగత ఆలోచనలతో పాటు మత విశ్వాసాలు, సామాజిక వాతావరణం టాటూలను తొలగించుకునేందుకు ప్రధాన కారణాలని తెలిపింది.

**టాటూలు క్యాన్సర్‌కు కారణమవుతాయా?**

టాటూలు, క్యాన్సర్ మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవడానికి పరిశోధకులు సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నారు. అయితే, ఇప్పటివరకు ఫలితాలు మిశ్రమంగా వచ్చాయి. చాలా అధ్యయనాలు టాటూ వేసుకోవడం వల్ల మాత్రమే చర్మ క్యాన్సర్ రాదని చెబుతుండగా.. టాటూ ఇంక్‌లో ప్రమాదాన్ని పెంచే పలు పదార్థాలు ఉండవచ్చని చెబుతున్నారు. కొన్ని టాటూ ఇంక్‌లలో 'అజో' అనే పదార్థం గుర్తించారు. టాటూ వేయించుకోవడానికి ఉపయోగించే ఇంక్‌లో దాదాపు 83 శాతం పాలీసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్స్ (PAHs) అని పిలువబడే మూలకాలను కలిగి ఉండవచ్చని ఆస్ట్రేలియన్ ప్రభుత్వం 2016లో చేసిన నివేదిక గుర్తించింది. ఇవి క్యాన్సర్ కారకాలుగా తేల్చారు.

**టాటూ ఇంక్ ప్రమాదకరం కావొచ్చు..!**

అమెరికన్ మీడియా నివేదిక ప్రకారం.. గత కొన్ని సంవత్సరాలుగా టాటూ ఇంక్ వల్ల ప్రజలకు ఇన్ఫెక్షన్లు వస్తున్నాయని చాలా ఫిర్యాదులు వచ్చాయి. కొంతమంది తమకు ఇంక్ కారణంగా అలెర్జీ ఉన్నట్లుగా తెలిపారు. టాటూ ఇంక్‌లోరెండు ప్రధాన భాగాలుంటాయి. అవి పిగ్‌మెంట్, క్యారియర్ సొల్యూషన్. ఇంక్ రసాయన విశ్లేషన్‌లో కొన్ని ఇంక్‌లలో ఉత్పత్తి లేబుల్‌లో జాబితా చేయని ఇథనాల్ వంటి పదార్థాలు ఉన్నట్లుగా తేలింది. ఈ పిగ్‌మెంట్ ఆరోగ్యానిక హానికరం కాదని.. కానీ, బ్యాక్టీరియా, అతినీలలోహిత కిరణాల వంటి వాటిని నైట్రోజన్ ఆధారిత సమ్మేళనాలుగా మార్చగలిగే అవకాశం ఉందని.. ఫలితంగా చర్మ క్యాన్సర్ ప్రమాదం కలిగిస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

అయితే, టాటూతో క్యాన్సర్ వస్తుందని ధ్రువీకరించిన నివేదికలు ఏమీ లేనప్పటికీ.. టాటూలు వేసేందుకు ఉపయోగించే ఇంక్ మాత్రం ప్రమాదకరమేనని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. కేవలం సర్టిఫైడ్ సెంటర్స్‌లో మాత్రమే టాటూలు వేసుకోవాలని.. ట్రైయినింగ్ లేని వ్యక్తులతో టాటూలు వేసుకుంటే సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## జాతీయ అగ్నిమాపక సేవా వారోత్సవాలు ప్రారంభం

జయభేరి, పరవాడ:

ప్రతి ఒక్కరూ భద్రత నియమాలు పాటించాలని పలువురు ఎన్టీపీసీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఎన్టిపిసి సింహాద్రిలో సోమవారం బాంబే డాక్ పేలుడులో ప్రాణాలు కోల్పోయిన వీర అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించడానికి ఏప్రిల్ 14ను ప్రతి సంవత్సరం జాతీయ అగ్నిమాపక సేవా దినోత్సవంగా జరుపుకుంటారు. అగ్నిమాపక సేవా వారోత్సవం ప్రభుత్వ రంగ సంస్థలోని ఉద్యోగులు/కార్మికులకు, ముఖ్యంగా ప్రజలకు అగ్ని నివారణ, అగ్ని భద్రతా చర్యలపై అవగాహన కల్పించడానికి ఒక ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుందనీ ఎన్టిపిసి ప్రతినిధులు పేర్కొన్నారు. ఎన్టిపిసి సింహాద్రి లో నియమించబడిన సిఐఎస్ఎఫ్ అగ్నిమాపక విభాగం 2025 ఏప్రిల్ 14నుండి 20 వరకు అగ్నిమాపక సేవా వారోత్సవాన్ని పాటిస్తోంది. ఈ అగ్నిమాపక సేవా వారోత్సవంలో, ఎన్ టి పి సి ఉద్యోగులు వారి వార్డులు, గృహిణులు, కార్మికులు, పాఠశాల పిల్లలు సాధారణ ప్రజలకు అగ్నిమాపక భద్రతా పద్ధతులు గురించి అవగాహన కల్పించడానికి అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా, ఎన్ టి పి సి సింహాద్రి జనరల్ మేనేజర్ ఓ అండ్ ఎం పి.కె. జెనా, ఇతర అధికారులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వారు ప్రసంగిస్తూ సిఐఎస్ఎఫ్ యూనిట్ ఎన్టిపిసి సింహాద్రి అసిస్టెంట్ కమాండెంట్ (అగ్నిమాపక) రామ్ లఖన్ సింగ్ అసిస్టెంట్ కమాండెంట్ (ఎగ్జిక్యూటివ్) రాజ్ చౌదరి, ఎన్టిపిసి కార్మికులు, వారి జీవిత భాగస్వాములు పాఠశాల పిల్లలకు అగ్నిమాపక భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. సింహాద్రిలో గత ఒక సంవత్సరం పాటు అగ్నిమాపక విభాగం చేసిన మంచి పని గురించి సమావేశాన్ని ప్రశంసించారు, ఈ కార్యక్రమంలో, అమరవీరులకు పుష్పగుచ్ఛాలు అర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన అగ్నిమాపక సిబ్బంది జ్ఞాపకార్థం "రెండు నిమిషాల మౌనం" పాటించారు. ఈ కార్యక్రమానికి సిఐఎస్ఎఫ్ సీనియర్ అధికారులు సిబ్బంది హాజరయ్యారు. సింహాద్రి జనరల్ మేనేజర్ (ఓ అండ్ ఎం) పికెజెనా తన ప్రసంగంలో సింహాద్రి భద్రత & అగ్ని రక్షణలో సిఐఎస్ఎఫ్ పాత్రను ప్రశంసించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఎన్టిపిసి సింహాద్రి భవిష్యత్తు అవకాశాల గురించి కొనియాడారు. సిఐఎస్ఎఫ్ యూనిట్ సింహాద్రి ఇన్‌స్పెక్టర్ హిమ్మత్ సింగ్ ముఖ్య అతిథికి ధన్యవాదాలతో కార్యక్రమం ముగిసింది.

## బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి

- భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్
- అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన
- మాల మహానాడు అధ్యక్షుడు సవాళ్ల వినోద్ కుమార్



జయభేరి, షాద్ నగర్, ఏప్రిల్ 14 :

అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన షాద్ నగర్ మాల మహానాడు అధ్యక్షుడు సవల్ల వినోద్ కుమార్. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని నిర్మించి గొప్ప మహనీయుడని. ఉన్నతమైన విద్యను అభ్యసించి భవిష్యత్తు తరాల వారికి ఒక మార్గదర్శకంగా నిలిచిన ఏకైక వ్యక్తి బిఆర్ అంబేద్కర్ ని అన్నారు. ఆయన విద్య వల్ల పేదరికాని తరిమికొట్టడమే కాకుండా విద్య అనేది భవిష్యత్తు రూపురేఖల్ని మారుస్తుందని నిరూపించిన మహనీయుడని అన్నారు. ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలకు మార్గదర్శకంగా నిల్చారనీ యువత విద్యాభ్యాసంలో అంబేద్కర్ ని స్ఫూర్తిగా తీసుకొని అన్ని రంగాలలో ముందుకు కొనసాగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు, యువత పాల్గొన్నారు.

## మా భూమి రథయాత్ర కు భారీగా తరలి వెళుతున్న ప్రజలు

- భూపాలపల్లి జిల్లా ప్రజలందరికీ మన జాతిపిత మన తండ్రి బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి శుభాకాంక్షలు
- భూపాలపల్లి జిల్లా నుండి మా భూమి రథయాత్ర కు భారీగా తరలి వెళుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ 90% ప్రజలు



జయభేరి, భూపాలపల్లి :

తెలంగాణ రాష్ట్రం లో BC SC ST jac, ధర్మ సమాజ్ పార్టీ సంయుక్తంగా నిర్వహించుతున్న లక్ష కిలోమీటర్ల రథయాత్ర తెలంగాణ గడ్డమీద బీసీ ఎస్సీ ఎస్టీ 90% ప్రజల రాజ్యాన్ని స్థాపించడానికి ప్రజల సమస్యల పరిష్కారానికి డాక్టర్ విశారదన్ మహరాజ్ 1 లక్ష కిలోమీటర్ల మాభూమి రథయాత్ర అదిలాబాద్ నుంచి హైదరాబాదు వరకు తండ్రి అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రారంభమై జూలై 2028 అంటే 3 సంవత్సరాల 3 నెలలు సుదీర్ఘంగా లక్ష కిలోమీటర్ల రథయాత్ర కొనసాగుతుంది. భూపాలపల్లి జిల్లా బీసీ ఎస్సీ ఎస్టీ, ధర్మ సమాజ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరు రవీందర్, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు దుగ్యాల స్వామి, తిరుపతి, రమేష్, సంతోష్ పాల్గొన్నారు.



# తూ మేరా లవరూ.. పెట్టావే చెవిలో క్యాలీఫ్లవరూ

'ఇడియట్'లో 'చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే..' సాంగ్ ఎంత హిట్టో తెలిసిందే. దివంగత సంగీత దర్శకుడు చక్రి స్వరపరిచి, స్వయంగా ఆలపించిన ఆ పాట రాష్ట్రాన్ని ఓ ఊపు ఊపేసింది. మళ్లీ ఆ పాటను.. ఆ ఫ్లేవర్‌నూ గుర్తుచేస్తూ.. శ్రోతలకు ఓ మ్యూజికల్ ఫేవర్ చేశారు సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో. రవితేజ నటించిన 'మాస్ జాతర' సినిమా కోసం ఆయన ఈ పాటను స్వరపరిచారు. అంతేకాదు, కృత్రిమ మేధా (AI) ని ఉపయోగించి దివంగత సంగీత దర్శకుడు చక్రి స్వరాన్ని తిరిగి సృష్టించారు. 'తు మేరా లవర్ లవర్ లవర్.. తుజ్ కో దియా ఫ్లవరూ.. తు మేరా లవర్ లవర్ లవర్.. పెట్టావే చెవిలో క్యాలీఫ్లవరూ..' అంటూ సాగిన ఈ పాటను భాస్కరభట్ల రవికుమార్ రాయగా..'ఇడియట్'లోని ఐకానిక్ సాంగ్ 'చూపుల్తో గుచ్చి గుచ్చి చంపకే..' పాటకు నివాళిగా మేకర్స్ ఈ పాటను అందించారు. రవితేజ శైలి డాన్స్, శ్రీలీల అద్భుతమైన నృత్య ప్రదర్శనతో ఈ పాట సినిమాకే హైలైట్ కానుందని మేకర్స్ తెలిపారు. త్వరలోనే విడుదల కానున్న ఈ యాక్షన్ ఎంటైర్టైనర్‌కు భాను బోగవరపు దర్శకుడు. ఈ చిత్రానికి కెమెరా: విధు అయ్యన్న, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య, నిర్మాణం: సితార ఎంటైర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్.

# వెంకటేశ్‌తో త్రివిక్రమ్ సినిమా?



వెంకటేశ్ త్రివిక్రమ్.. ఈ కాంబినేషన్ సినిమా కోసం ఆశించని ప్రేక్షకుడు లేడు. వెంకటేశ్ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు రాశారు. దర్శకుడయ్యాక ఆయన వెంకీతో సినిమా చేస్తారని అందరూ భావించారు. కానీ ఎందుకో ఆ కాంబినేషన్ సెట్ కాలేదు. అయితే.. ఎట్టకేలకు వెంకీ, త్రివిక్రమ్‌ల కాంబినేషన్ సెట్ అయ్యిందని విశ్వసనీయ సమాచారం. వాస్తవానికి బన్నీ హీరోగా త్రివిక్రమ్ ఓ సినిమా చేయాలి. అయితే.. అట్లీ ప్రాజెక్ట్‌ని ముందు ఓకే చేశారు బన్నీ. ఆ ప్రాజెక్ట్ పూర్తయ్యే సరికి దాదాపు ఏడాదిన్నర పట్టడం ఖాయం. ఈ లోపు బన్నీ స్క్రిప్ట్ పూర్తి చేస్తూ, మరోవైపు వెంకీతో సినిమా కానిచ్చేయాలని త్రివిక్రమ్ నిర్ణయించారట. వెంకటేశ్‌కి సరిగ్గా సరిపోయే ఫ్యామిలీ డ్రామా సబ్జెక్ట్ త్రివిక్రమ్ దగ్గర సిద్ధంగా ఉందట. త్వరలో షూటింగ్ మొదలుపెట్టి, త్వరగా పూర్తి చేయాలనే సంకల్పంతో త్రివిక్రమ్ ఉన్నారట. ఆ వెంటనే బన్నీ సినిమా మొదలుపెడతారన్నమాట.



# స్టార్ డమ్ కోసం..

ఇండస్ట్రీలో చాలా మంది హీరోయిన్స్ స్టార్ డమ్ కోసం ప్రయత్నిస్తున్నారు. వారిలో కేథరిన్ థ్రెసా ఒకరు. కేథరిన్ అసలు పేరు కేథరిన్ థ్రెసా అలెగ్జాండర్. ఈ ముద్దుగుమ్మ తెలుగు, తమిళ చిత్రాల్లో నటిస్తుంది. ఈ చిన్నది దుబాయ్‌లో మలయాళీ క్రైస్తవ కుటుంబంలో జన్మించింది. చదువుతో పాటు కేథరిన్ పియానో, నృత్యం, గానం, ఐస్ స్కేటింగ్, డిబేటింగ్‌లో శిక్షణ పొందింది. దుబాయ్‌లో ఉన్నప్పుడు ఈ బ్యూటీ ఎమిరేట్స్ ఎన్విరాన్‌మెంట్ వాలంటీర్‌గా కూడా పనిచేసింది. తెలుగులో ఈ అమ్మడు 17 సినిమాల్లో నటించింది. కానీ ఈ చిన్నదానికి అనుకున్నంత గుర్తింపు మాత్రం దక్కలేదు. 2013లో వరుణ్ సందేశ్ సరసన "చమ్మక్ చల్లో" చిత్రంతో తెలుగు తెరంగేట్రం చేసింది. ఈ సినిమా విజయవంతం కానప్పటికీ, ఆమె నటన, అందం విమర్శకుల ప్రశంసలు పొందాయి. నానీ సరసన "పైసా" ), అల్లు అర్జున్ సరసన "ఇద్దరమ్మాయిలతో", "సరైనోడు", రానాతో "నేనే రాజు నేనే మంత్రి", గోపీచంద్ తో "గౌతమ్ నంద వంటి సినిమాల్లో నటించి మెప్పించింది. అలాగే స్పెషల్ సాంగ్స్ లోనూ ఈ అమ్మడు మెప్పించింది. జయజనకీ నాయక సినిమాలో స్పెషల్ సాంగ్ లో స్టెప్పులేసింది. కేథరిన్ థ్రెసా ప్రస్తుతం తెలుగు, తమిళ చిత్రాల్లో కొన్ని ప్రాజెక్టుల్లో నటిస్తోంది.



# అది దా సర్ప్రైజ్..!

ఇటీవలే రూ. 300కోట్లు వసూల్ చేసిన సినిమాలో నటించి భారీ విజయాన్ని అందుకుంది ఆ ముద్దుగుమ్మ. కెరీర్ లో మొదటి ఫోటో షూట్ అది. అప్పటికీ ఇప్పటికీ ఆమె ఎంతో మారిపోయింది. ఆమెను గుర్తుపట్టారా.? ఇప్పుడు చూస్తే షాక్ అవుతారు. చాలా మంది హీరోయిన్స్ కెరీర్ బిగినింగ్ లో చాలా డిఫరెంట్ గా ఉంటారు. అప్పటికీ ఇప్పటికీ చాలా మారిపోతారు. అప్పటికీ ఇప్పటికీ అందంలో ఎంతో మార్పు వస్తుంది. పైన కనిపిస్తున్న హీరోయిన్ ఎవరో కనిపెట్టరా.? ఆమె చాలా ఫెమస్. ఆమె మరెవరో కాదు లేటెస్ట్ క్రేజీ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్. ఈ ముద్దుగుమ్మ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తమిళ్ లో ఎన్నో సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించింది ఈ చిన్నది. ఇక తెలుగులో కౌసల్య కృష్ణమూర్తి, వరల్డ్ ఫేమ్స్ లవర్ లాంటి సినిమాలు చేసింది. ఇక రీసెంట్ గా వెంకటేష్ సరసన సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భారీ హిట్ అందుకుంది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో భాగ్యం పాత్రలో అద్భుతంగా నటించి మెప్పించింది. ఇక ఈ అమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా ఫోటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. తాజాగా ఇన్ స్టాలో ఫస్ట్ ఫోటో షూట్ ను షేర్ చేసింది. అలాగే లేటెస్ట్ ఫోటో షూట్ కూడా షేర్ చేసింది ఐశ్వర్య రాజేష్. ఈ ఫోటో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది.





# ఇన్నాళ్లకి మళ్లీ కలిసిన బన్నీ, పవన్ కళ్యాణ్..

కొన్నాళ్లుగా ఇండస్ట్రీలో జరుగుతున్న చర్చనీయాంశాలలో మెగా వర్సెస్ అల్లు ఫ్యామిలీల వార్ ఒకటి. గతేడాది జరిగిన ఎన్నికల సమయంలో అల్లు అర్జున్ వైసీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డికి మద్దతు ప్రకటిస్తూ నంద్యాల వెళ్లి మరీ ప్రచారం చేశారు. ఆ సమయంలో మెగా ఫ్యామిలీ అంతా కూడా పవన్ కల్యాణ్ వైపు అంటే ..ఒక్క అల్లు అర్జున్ మాత్రం వైసీపీ అభ్యర్థికి తన మద్దతు ప్రకటించారు. అయితే అల్లు అర్జున్ మద్దతు ప్రకటించిన శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి ఘోరంగా ఓడిపోవడంతో మెగా అభిమానులు అల్లు అర్జున్‌ని ఓ రేంజ్‌లో ఆడేసుకున్నారు.

ఆ తర్వాత నాగబాబు పరోక్షంగా ట్వీట్ చేయడం, మెగా హీరోలు కూడా బన్నీ విషయాలలో పెద్దగా స్పందించకపోవడంతో అల్లు అర్జున్.. మెగా ఫ్యామిలీకి దూరమయ్యాడనే ప్రచారం అయితే జోరుగా నడిచింది. .పుష్ప 2 సినిమా ఇండస్ట్రీ హిట్ కొట్టినప్పటికీ , మెగా హీరోలెవ్వరూ స్పందించకపోవడం, అల్లు అర్జున్ అరెస్ట్ ఎపిసోడ్‌లో కూడా మెగా ఫ్యామిలీ హీరోలు ఏ మాత్రం స్పందించకపోవడం, రామ్ చరణ్ పుట్టిన రోజు సందర్భంగా బన్నీ ఒక్క ట్వీట్ కూడా వేయకపోవడం వంటివి రెండు ఫ్యామిలీల మధ్య పెరిగిన దూరానికి సంకేతాలుగా చెప్పుకొచ్చారు.

అయితే నిన్న సాయంత్రం అల్లు అర్జున్ పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లి మరీ అతన్ని కుమారుడిని పరామర్శించడం హాట్ టాపిక్‌గా మారింది. కొద్ది రోజుల క్రితం పవన్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ సింగపూర్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే బన్నీ ఆయన భార్య స్నేహ రెడ్డి పవన్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. చిన్నారి ఆరోగ్యంపై ఆరా తీసినట్లు సమాచారం. ఈ సందర్భంగా అల్లు అర్జున్.. పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులతో దాదాపు గంటసేపు మాట్లాడినట్లు సమాచారం. ఇన్నాళ్లు బన్నీ ఫ్యాన్స్ వర్సెస్ మెగా ఫ్యాన్స్ అంటూ జరిగిన గొడవ ఈ కలుయికతో కొలిక్కి వస్తుందా లేదా అనేది చూడాలి.


Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com